ప్రజాశక్తి
శుక్రవారం 23 మే 2025
5
కర్నూలు

స్మార్ట్ మీటర్లు వద్దంటూ ఇంటి గోడకు స్టిక్కర్ అతికిస్తున్న మహిళ

# అమ్మకానికి 'చదువు'




**ఫీజుల పేరుతో దోచుకుంటున్న ప్రైవేటు విద్యాసంస్థలు**

**ఖాళీ అవుతున్న సామాన్యుల జేబులు**

విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే జిల్లాలోని కొన్ని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు అడ్మిషన్లు చేప డుతున్నాయి. పరిమిత సీట్లు అంటూ బోర్డులు పెట్టి ఆర్భాటపు ప్రకటనల తో విద్యార్థులను, తల్లిదండ్రులను ఆక ర్షిస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో సరైన సౌకర్యాలు, క్రీడా మైదానాలు లేకపోయినా నిర్వాహకులు ఫీజుల మోత మోగిస్తున్నారు. అడ్మిషన్ ఫీజు పేరుతో రూ.2వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారు. దీనికి తోడు ట్యూషన్ ఫీజు, స్పెషల్ ఫీజు, స్కూల్ డెవలప్‌మెంట్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ఫీజు, స్మార్ట్ క్లాసులు.. ఇలా అన్నింటికీ ఫీజులు పిండే స్తున్నారు. కొత్తగా అడ్మిషన్ తీసుకుంటే రెగ్యులర్ ఫీజుతోపాటు అదనపు భారాన్ని మోయాల్సిందే. పుస్తకాలు, యూనిఫాం, షు కూడా తమ పాఠ శాలలోనే కొనుగోలు చేసేలా నిబంధ న విధిస్తున్నారు. వాటి పేరిట మరి కొంత దోచేస్తున్నారు. ఒకటో తరగతి నుంచి ఐదోతరగతి వరకు పాఠ్యపుస్తకాలను రూ.10వేల నుంచి రూ.12వేలకు విక్రయిస్తున్నారు...

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

కర్నూలు జిల్లాలో 745 ప్రయివేటు పాఠశాలలు, నంద్యాల జిల్లాలో 559 ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒకటోతరగతి నుండి మూడో తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.6వేలు, మండల కేంద్రాల్లో ఉన్న పాఠశాలల్లో రూ.7,500, పట్టణాల్లో 8,600, జిల్లా కేంద్రంలో రూ.10వేలు చొప్పున ఫీజులు నిర్ధారించారు. 4 నుంచి 5 తరగతులకు గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.9వేలు, పట్టణాల్లో రూ.10,500, జిల్లా కేంద్రంలో రూ.12వేలు, ఆరోతరగతికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.9వేలు, మండల కేంద్రాల్లో రూ.9,500, పట్టణాల్లో రూ.11,100 పాఠశాల స్టార్ రేటింగ్ మేరకు ఈ ఫీజులను నిర్ణయించారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులపై అధ్యయనం చేయడానికి ఐఏఎస్ అధికారులతో గతంలో ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. ఏ పాఠశాలలో ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ప్రాంతాల వారీగా ఈ కమిటీ పరిశీలించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందించింది. పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని గ్రామాలు,పట్టణాల్లో పాఠశాలలను ఐదు కేటగిరీలుగా విభజించారు. స్టార్ రేటింగ్ స్కూల్స్‌కు 1 నుంచి 10వ తరగతి వరకు ఫీజులు కూడా నిర్ధారిస్తూ ఈ కమిటీ సిఫారసు చేసింది. అలాగే ఫీజు వసూలు, సౌకర్యాల వంటి వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలి. కానీ ఈ నిబంధనలను ప్రైవేటు పాఠశాలలు పాటించడం లేదు. సిలబస్ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముద్రించే పుస్తకాలను బోధించాలి. కానీ కొన్ని పాఠశాలల్లో ఒక్కొక్క పబ్లికేషన్ పుస్తకాలను ఐటీఐ ఒరియంటెడ్ పేరుతో విక్రయిస్తూ వాటినే బోధిస్తున్నారు. ఆరోతరగతి నుంచి తొమ్మిదోత రగతి వరకు ఇంటర్‌స్థాయిలో ఉండే సిలబస్‌ను జోడించి సొంతంగా పుస్తకాలను విక్రయిస్తున్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలను విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

**అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు**

ప్రయివేటు పాఠశాలలు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారమే ఫీజులను వసూలు చేయాలి. అలా కాకుండా ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. అలా ఎక్కడానై అధిక ఫీజులు వసూలు చేస్తుంటే మా దృష్టికి తీసుకురావచ్చు.

- శామ్యూల్ పాల్, డిఈఓ.

**ఫీజు నియంత్రణ చట్టం పటిష్టంగా అమలు చేయాలి**

ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఏ ప్రయివేటు పాఠశాలా ఫీజులను వసూలు చేయడం లేదు. అధికంగా వసూలు చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు కూడా ప్రయివేటు, కార్పొరేటు యాజమాన్యాలకే వత్తాసు పలికే విధంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించాలని కోరిక ఉన్న తల్లిదండ్రులను ఫీజులను చూసి భయపడుతున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు, విద్యా శాఖ మంత్రి స్పందించి ఫీజు నియంత్రణ చట్టం పటిష్టంగా అమలు చేసేలా చూడాలి. అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి.

- ఎస్ అబ్దుల్లా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు.

# అదానీకి దోచిపెట్టేందుకే స్మార్ట్ మీటర్లు

**- స్మార్ట్ మీటర్లు వద్దంటూ సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం**

**ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్**

రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా అదానీకి దోచి పెట్టేందుకే విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, టి.రాముడు విమర్శించారు. గురువారం కర్నూలు నగరంలోని 43వ వార్డు ఇందిరా గాంధీ నగర్, పీవీ నరసింహారావు నగర్, ఇల్లూరు నగర్ తదితర ప్రాంతాలలో సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ప్రజలను చైతన్యం చేస్తూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు వద్దంటూ సిపిఎంగా ముద్రించిన స్టిక్కర్లను ఇండ్లకు అతికించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఉన్నా, కూటమి టిడిపి ప్రభుత్వం ఉన్నా ప్రధాని నరేంద్ర మోడీ మిత్రుడు అదానీకి దోచి పెట్టేందుకే స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కాకముందే ప్రజలకు ఇచ్చిన మాటను పక్కనపెట్టి విద్యుత్ చార్జీల భారాన్ని ట్రూఅఫ్ చార్జీ పేరుతో వేశారన్నారు. ప్రజలపై వేసిన విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించాలని ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని, ఇంటింటికి స్మార్ట్ మీటర్ పెట్టే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం వేసిన విద్యుత్ ఛార్జీలను వ్యతిరేకిస్తూ స్మార్ట్ మీటర్లు వద్దు అని సిపిఎం చేపట్టిన పోరాటానికి ప్రజలు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎం.భాస్కర్, వై.నగేష్, వి.శంకర్, వార్డు నాయకులు శ్రీనివాసులు, విజయ్ కుమార్, రోశయ్య. మద్దిలేటి, విక్రమ్, డేవిడ్, సుధాకర్, హుస్సేన్ బాషా, జమాల్, 43వ వార్డు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

**ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్**

మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుండి యోగాంధ్ర క్యాంపెయిన్‌పై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 22 వరకు ప్రతి రోజు ఒక జిల్లాలో ఒక థీమ్‌తో స్టేట్ ఈవెంట్ యోగా సెషన్‌ను నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. అందులో భాగంగా జూన్ 17న కర్నూలు జిల్లాలో 5 వేల మంది పారిశుధ్య కార్మికులతో యోగా కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.. జూన్ 8న కర్నూలు, ఆదోని, పత్తికొండ డివిజన్‌లలోని 3 ప్రదేశాల్లో సీనియర్ సిటిజన్లతో యోగా కార్యక్రమాలను నిర్వహించాలని, అందుకు ఏర్పాట్లు చేయాలని ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలకు సూచించారు. పర్యాటక ప్రాంతాలైన కొండారెడ్డి బురుజు, ఓర్వకల్లు రాక్ గార్డెన్, నగరవనం, మంత్రాలయంలలో ఈ నెల 30, జూన్ 5, 12, 18వ తేదీలలో ప్రత్యేక యోగా కార్యక్రమాలను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు ఆర్డీఓను, డిఎఫ్ఓను, ఓర్వకల్లు ఎంపిడిఓలను ఆదేశించారు. దాదాపు 1000 మందితో ఈ కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉందన్నారు. సంబంధిత మండలాల ఎంపిడిఓలతో కో ఆర్డినేట్ చేసుకొని కార్యక్రమాలను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కర్నూలు నగరంలో ప్రతి రోజూ యోగా నిర్వహించేందుకు ఒక రోడ్డును గుర్తించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్డీవో సందీప్, పత్తికొండ ఆర్డీఓ భరత్, అన్ని మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

**చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు : కలెక్టర్**

చెరువులకు సంబంధించి మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి ఇంప్లిమెంటేషన్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆర్‌ఆర్‌ఆర్ స్కీం కింద చిన్న నీటి పారుదల చెరువులకు మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు అవకాశం ఉందన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ స్కీం ద్వారా కేంద్రం నుండి 60 శాతం, రాష్ట్రం నుండి 40 శాతం నిధులతో ఈ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి జిల్లాలో ఉన్న చిన్న నీటి పారుదల చెరువులకు మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు తగిన అంచనాలను రూపొందించాలని జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జలవనరుల శాఖ ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి, ఎంఐ వర్క్స్ డివిజన్ ఈఈ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, గ్రౌండ్ వాటర్ డిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు అండగా టిడిపి

**- ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వంపై ఒత్తిడి**

**- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి**

**ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్**

బీసీలకు అండగా టిడిపి నిలుస్తుందని, జిల్లా సమగ్రాభివద్దే లక్ష్యంగా పని చేస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉందన్నారు. గురువారం కర్నూలు నగర శివారులోని కమ్మ సంఘం మండపంలో టిడిపి కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు తిక్కారెడ్డి అధ్యక్షతన మహానాడు నిర్వహించారు. ముందుగా మహానాడు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టిడిపి పతాకాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అభిష్కరించారు. అనంతరం ఎన్‌టి రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇటీవల జమ్మూకాశ్మీరులో మృతి చెందిన వీర జవాన్లకు, వైసిపి నేతల చేతిలో మృతి చెందిన టిడిపి కార్యకర్తలకు సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ వైసిపి పాలనకు విరక్తి చెందిన ప్రజలు రాష్ట్రంలో టిడిపిని భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు పార్లమెంట్ సీట్లు, 14 ఎమ్మెల్యే స్థానాల్లో 12 విజయం సాధించానున్నారు. పార్టీలో కష్టపడిన వారిని గుర్తించి నామినేటెడ్ పదవులు ఇచ్చినట్లు చెప్పారు. కడప మహానాడు అయిన తరువాత మరికొందరికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చేందుకు జాతీయ అధ్యక్షులు సుముఖంగా ఉన్నారని తెలిపారు. నియోజక వర్గాల్లో జరిగిన మహానాడులో చేసిన తీర్మాణాలను ఎమ్మిగనూరు ఎమ్మెల్ బివి జయ నాగేశ్వరరెడ్డి చదివి వినిపించారు. గుండ్రేవుల, వేదవతి, ఆర్‌డిఎస్ ప్రాజెక్టుల పూర్తి, హంద్రీనీవా ప్రాజెక్టు, దుండి చెరువులు నింపడంతోపాటు పిల్లకాల్వల ద్వారా సాగునీరు అందించేందుకు కషిచేయాలని, కోడుమూరుకు సాగునీటి ఇబ్బందుల నుండి గట్టెక్కించేందుకు గాజులదిన్నె ప్రాజెక్టు నుండి నీటిని తీసుకురావడం లాంటి నిర్మాణాలు మహానాడులో ప్రవేశపెట్టనున్నా మన్నారు. రాబోయో స్థానిక సంస్థలపై ప్రతి ఒక్కరు దృష్టి సారించా లన్నారు. కడపలో జరుగు ముహానాడుకు కర్నూలు జిల్లా నుండి బారీ ఎత్తున తరలివచ్చి జయద్రపం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపి బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, ఆదోని ఇన్‌ఛార్జి మీనాక్షినాయుడు, మంత్రాలయం ఇన్చార్జి రాజశేఖరెడ్డి, అలూరు ఇన్చార్జి వీరభద్రగౌడు, కెడిసిసి బ్యాంక్ చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావుయాదవ్, తుగ్గలి నాగేంద్ర, కుడా సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు గౌరువెంకటరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మెన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, కురవ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, నాయకులు రాజశేఖర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ముంతాజ్, కేబీ మ్యూరెడ్డి, కార్పొరేటర్ పద్మలతారెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మహానాడు వేదికపై అభివాదం తెలుపుతున్న టిడిపి నేతలు, ఎమ్మెల్యేలు తదితరులు

**మహానాడు వేదికగా భగ్గుమన్న విభేదాలు**

మహానాడు వేదికగా టిడిపిలో విబేధాలు భగ్గుమన్నాయి. వేదికపై మాజీ మంత్రి కెఈ ప్రభాకర్ మంత్రి టీజీ భరత్‌ను టార్గెట్ చేస్తూ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలో మేయర్లు, ఛైర్మెన్‌లపై అవిశ్వాస తీర్మానం పెట్టి తొలగిస్తుంటే కర్నూలులో కనీసం పట్టించుకోచడం లేదన్నారు. పార్టీ వారిని కాదని వైసిపి నుండి వచ్చిన వారికి పదవులు ఇస్తున్నారని ఆరోపించారు. మేయర్ విషయంలో నెల రోజులు గడువు ఇస్తున్నామని, తరువాత ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామన్నారు. పాణ్యం నియోజకవర్గంలో కూడా కార్పొరేటర్లు ఉన్నారని, ఆ ఎమెల్యే కూడా చొరవ చూపాలన్నారు.

మాట్లాడుతున్న అధికారులు

## రూసా పనుల నాణ్యతపై కమిటీ పరిశీలన

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల కళాశాల, సిల్వర్ జూబ్లీ కళాశాలలో సుమారు రూ.55 కోట్ల రూసా నిధులతో చేపట్టిన పనుల పురోగతి, నాణ్యతను క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు అధ్యక్షతన కమిటీ బృందం గురువారం పరిశీలించింది. కమిటీ బృందం రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయకుమార్ నాయుడు, ద్రవిడ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి కిరణ్ కుమార్, ఆర్జెడి సిఈ డి.నాగలింగారెడ్డి, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.శశికళ, కడప సర్కిల్ ఏపీఈడబ్ల్యుఐడీసీ ఎస్‌ఈ ఎస్ శివకుమార్, ఏపీఎంఎస్ఐడిఎస్ ఈఈ కె.నివాస్ రెడ్డి బృందం బిల్డింగులను పరిశీలించారు. బిల్డింగులు, క్యాంటీన్, గ్రంథాలయాలు, శానిటేషన్, క్లాస్ రూమ్‌లు, పిల్లర్స్ నాణ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం హాల్‌లో కమిటీ బృందం సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాస్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి, కెవిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్ రెడ్డి, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## సారా రహిత జిల్లాగా మార్చండి

**-ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ**

**ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్**

సారా రహిత జిల్లాగా మార్చాలని రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ తెలిపారు. గురువారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో జిల్లా ఎక్సైజ్ అధికారులతో నవోదయం 2.0 అమలు తీరును, జిల్లా ఉద్యోగుల పని తీరుపై సమీక్షించారు. జిల్లాలో నాటుసారా, సుంకం చెల్లించని అక్రమ మద్యం, గంజాయిని అరికట్టడంలో తీసుకోవాల్సిన చర్యలు, వీటిపై నమోదు చేసిన కేసుల పురోగతిపై సమీక్షించారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కార్యాలయం కంట్రోల్ రూమ్ నుంచి బార్డర్ చెక్ పోస్టుల పనితీరును పరిశీలించారు. రీజనల్ ఎక్సైజ్ లేబొరేటరీని, అందులోని పరికరాలను పరిశీలించి ల్యాబ్ పనితీరును సమీక్షించారు. జిల్లా కార్యాలయం ఆవరణలో తిరిగి మొక్కలు నాటారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్, కానిస్టేబుల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గిరిబాబులు రాహుల్ దేవ్ శర్మను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్ బాబు, ఎఇఎస్‌లు రాజశేఖర్ గౌడ్, రామకృష్ణా రెడ్డి, సిఐలు రాజేంద్ర ప్రసాద్, జయరాం నాయుడు, చంద్రహాస్ పాల్గొన్నారు.

రాహుల్ దేవ్ శర్మను సన్మానిస్తున్న అధికారులు

# నగరంలో నీటి కష్టాలు

**- నీటి కోసం రోజూ జాగారమే**
**- శివారు కాలనీలో మూడు రోజులకోసారి నీరు**
**- పట్టని అధికారులు**

**ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్**

**కర్నూలు నగర వాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు. నీటి కోసం ప్రతి రోజు జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. శివారు కాలనీలో మూడు రోజులకోసారి నీరు వస్తున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి...**

కర్నూలు నగర జనాభా సుమారు 7.65 లక్షలకు చేరింది. కర్నూలు నగరంలోని 52 వార్డులలో ఉన్న జనాభాకు సరిపడా తాగునీరు అందించడంలో అధికారులు ఘోరంగా వైఫల్యం చెందుతున్నారు. పట్టణ ప్రజలకు నీటి కష్టాలు లేకుండా చేయాలని కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద ఎంపిక చేసింది. 2023లో పనులకు పచ్చ జెండా ఊపగా అప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వం వాటిని సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు విఫలం చెందారు. డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) రూపొందించ కపోవడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. రూ.438.12 కోట్లు ప్రాజెక్టు లేకుండా పోయింది. దానిపై కూటమి ప్రభుత్వం డిపిఆర్ తయారుచేసి పనులు వేగవంతం చేసి ప్రజలందరికీ తాగునీరు అందించేందుకు కృషి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. 2000 సంవత్సరంలో కల్లూరు ప్రాంతం నగరపాలక సంస్థలో విలీనమయింది. ఇప్పటికీ రోజూ తాగునీరు అందించడంలో అధికారులు విఫలం చెందుతున్నారు. శివారు కాలనీలకు నీరందక నేటికీ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడంతో కల్లూరు ప్రాంతంపై అధికారులు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కల్లూరు ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. జగన్నాథం గట్టు వద్ద 50 ఎంఎల్‌డి సామర్థ్యంతో నీటి ట్రీట్మెంట్ ప్లాంటును కల్లూరు ప్రాంతంలో నీరు నిలువ ఉంచేందుకు 20 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. వీటికి తోడు నగరం లో విలీనమైన మామిదాలపాడు, మునగాలపాడు, లక్ష్మీ పురం తదితర ప్రాంతాలతో పాటు ఆ వార్డులలో గ్రామాలకు 130 ఎంఎల్‌డి నీటిని సరఫరా చేయాల్సి ఉండగా 95 ఎంఎల్‌డి మాత్రమే నీరు సరఫరా చేస్తున్నారు. అమృత్ 2 పథకం 2025-26 సంవత్సరానికి పూర్తి చేయాల్సి ఉంది. అమృత్ పథకంలో పాత పైపులైన్ల స్థానంలో కొత్త పైపులైన్లు వేశారు. వాటికి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఇవ్వాలనీ గతంలో వీధుల్లో ఉన్నటు పబ్లిక్ కుళాయి సక్రమంగా వినియోగించ డం లేదని నీరు వృథా అవుతుందనే నెపంతో అన్ని క్లోజ్ చేశారు. శివారు కాలనీలలో వేసవిలో నీరు సరఫరా కాని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. నీరు చాలీచాలని పరిస్థితుల్లో ప్రజలు నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు.

**మూడు రోజులకోసారి నీళ్లు**

**- రంగన్న, పెద్దపాడు.**

మాజీ దళిత ముఖ్యమంత్రి గ్రామమైన పెద్దపాడు గ్రామంలో ప్రస్తుతం డిప్యూటీ మేయర్‌గా సిద్ధారెడ్డి రేణుక కూడా ఉన్నప్పటికీ గ్రామ ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. సమయపాలన పాటించకుండా రాత్రి 11 గంటల తర్వాత నీరు వదలడంతో ప్రజలు జాగరణ చేయాల్సిన పరిస్థితి ఉంది. ఆ నీరు కూడా తక్కువ సమయం రావడంతో వాడుకోవడానికి సరిపోవడం లేదు. వీధిచివరి వరకు నీరు రావడం లేదు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినప్పటికీ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

**సమయపాలన లేదు**

**- మధు, ఎన్టీఆర్ నగర్**

సమయపాలన పాటించకుండా రాత్రి, పగలు ఎప్పుడంటే అప్పుడు నీరు వదిలేవారు. మీరు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉండేది. కూలీలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పాత పైప్ లైన్‌లు ఉన్నప్పుడు రెగ్యులర్‌గా నీరు వచ్చేది కొత్త పైప్ లైన్లు వేసినప్పటి నుండి మూడు రోజులకు ఒకసారి నీళ్లు వస్తున్నాయి. ఇటీవల సమస్య కొంత మెరుగుపడింది.

**ఎక్కడి పనులు అక్కడే**

**- బివై.రామయ్య, మేయర్.**

కల్లూరు ప్రాంతానికి 130 కోట్లతో అమృత్ పథకం కింద డిపిఆర్ తయారుచేసిన టెండర్ దశలోనే ఆగిపోయాయి. ఆ ప్రాంత ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు 17 ఓవర్ హెడ్ ట్యాంకులు కావాలి. కౌన్సిల్లో పెట్టాము. టిడిపి ప్రభుత్వంలో నిధుల లేమీతో పనులన్నీ ఆగిపోయాయి. 30 సంవత్సరాల క్రితం కట్టిన ఓవర్ హెడ్ ట్యాంకులు వాడకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. నిధులు విడుదల కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి.

**నీళ్లు కొని తాగుతున్నారు**

**- టి.రాముడు, సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి.**

నగర జనాభా విపరీతంగా పెరుగు తోంది. కాలనీలు పెరుగుతున్నాయి. గతంలో వేసిన పైపులైన్లు కాలువల్లో ఉండి రంధ్రాలు పడటంతో నీరు కలుషిత మవుతుంది. మురికివాడలో ప్రజలు కలుషిత నీరు తాగలేక ఫిల్టర్ వాటర్ తాగుతున్నారు. కల్లూరు కర్నూలు కార్పొరేషన్ లో విలీనమై 25 సంవత్సరాల అయినప్పటికీ తాగునీటి సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నాయి. అధికారులు మారుతున్నారు. సమస్య అలాగే ఉంటుంది. కల్లూరు ప్రాంతంలో 16 వార్డులు ఉన్నప్పటికీ అక్కడి ప్రాంత ప్రజల నుండిఎక్కువ శాతం పన్నులు వసూలు చేస్తున్నారు. వారికి కనీస అవసరాల లో ఒకటైన నీటి సమస్యలపై దృష్టి మాత్రం సాధించడం లేదు. సమస్య పరిష్కారం కోసం మరొక సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించాలి. అమత పథకంలో వేసిన పైప్ లైన్ ల పనిలో డబ్బులు అందరి కాంట్రాక్టర్ జోబుల్లోకివెళ్లాయి. కల్లూరు ప్రాంతంలో శిథిలమైన ట్యాంకులను కూల్చేసి తాగునీటి అవసరాలకు తీర్చేందుకు 25 ఓవర్ హెడ్ ట్యాంకులు కావాలి.

## ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

**- నగర పాలక సంస్థ మేనేజర్ చిన్న రాముడు**

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని నగరపాలక సంస్థ మేనేజర్ ఎన్.చిన్నరాముడు సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన నగరపాలక కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదుల స్వీకరణ విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంబంధిత విభాగ అధికారి అందుబాటులో లేకపోవడం, దస్త్రాలు సక్రమంగా లేకపోవడంపై మేనేజర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరంలో నగరపాలక సంస్థకు సంబంధించి ఎన్నో సమస్యలు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ విభాగానికి వస్తాయని, ఇక్కడ పని చేసే సిబ్బంది ఏమాత్రం అజాగ్రత్తగా ఉండకూడదని సూచించారు. వచ్చిన విన్నపాలను తక్షణమే సంబంధిత అధికారులకు పంపించి, ఎప్పటికప్పుడు సమస్య పరిష్కార స్థితిని కనుగొని ఫిర్యాదుదారుడికి తెలియజేయాలని తెలిపారు. పని వేళల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాల్సిందేనని, దస్త్రాలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. నగర ప్రజలు తమ కాలనీల్లో చిన్నపాటి సమస్యల పరిష్కారం కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 7422992299కు కాల్ లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అలాగే పురమిత్ర యాప్‌లో సైతం ప్రజలు సమస్యలను తెలపవచ్చని పేర్కొన్నారు. సరస్వతి, నాగమణి, రాజశేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మేనేజర్ చిన్న రాముడు

## నిద్ర మత్తులో మున్సిపల్ అధికారులు : సిఐటియు

**ప్రజాశక్తి - గూడూరు**

గూడూరు నగర పంచాయతీలో ఉన్న పార్వతి థియేటర్ సందులో మురుగు కాలువల్లో ప్రవహించే నీరు ఇళ్లల్లోకి వస్తోందని, అధికారులు నిద్రమత్తులో ఉన్నారని సిఐటియు డివిజన్ నాయకులు మోహన్ మండిపడ్డారు. గురువారం ఆయన మాట్లాడారు. ఆ ఏరియా కౌన్సిలర్‌కు ఎన్నిసార్లు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకుండా అధికారులకు చెబుతున్నానని చెబుతున్నారని అన్నారు. ఇప్పటిదాకా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విమర్శించారు. వర్షాలు కురుస్తుండడంతో మురుగు కాలువలు బ్లాక్ అయి ఇళ్లల్లోకి మురుగునీరు వస్తోందని తెలిపారు. ఆ కాలనీలో నివసిస్తున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నామని చెప్పారు. మున్సిపల్ అధికారులు నిద్రమత్తు వదిలి ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తగా తీసుకోవాలని తెలిపారు. లేకపోతే ధర్నా చేపడతామని హెచ్చరించారు.

మోహన్‌తో మాట్లాడుతున్న ప్రజలు

## నేరాల నివారణకు సహకరించాలి : డీఎస్పీ

**ప్రజాశక్తి - కర్నూలు క్రైం**

నేరాల నివారణకు ప్రజలు సహకరించాలని కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ కోరారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వుల మేరకు కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం కర్నూలు నాలుగో పట్టణ సిఐ మధుసూదన్ గౌడ్, కర్నూలు సబ్ డివిజన్ ఎస్ఐలు, సిబ్బంది, హోంగార్డ్స్‌తో కలిసి కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని శరీన్ నగర్‌లో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లల్లో తనిఖీలు చేశారు. పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహన పత్రాలు సరిగా లేని 12 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శరీన్ నగర్ ప్రజలతో నాలుగో పట్టణ సిఐ మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ... నేరాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నా రు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాల గురించి ఎప్పటికప్పుడు పోలీసు లకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమాన స్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# రజక వృత్తిదారుల హామీలు అమలు చేయాలి

- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముక్కన్న, గురు శేఖర్

**ప్రజాశక్తి - కౌతాళం**

రాష్ట్ర ప్రభుత్వం రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముక్కన్న, గురు శేఖర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో రజక వృత్తిదారుల సంఘం సమావేశం నిర్వహించారు. మండల నాయకులు సి.మహేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డారు. రాష్ట్రంలో రజక రాష్ట్ర కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్పొరేషన్‌కు రూ.1000 కోట్ల నిధులు కేటా యించి రజకులకు బీసీ కార్పొరేష న్ ద్వారా సొసైటీలు ఏర్పాటు చేసి రుణాలు ఇవ్వాలని డిమాం డ్ చేశారు. ప్రతి గ్రామానికీ దోభీ ఘాట్లు ఏర్పాటు చేయాలని కోరారు. జిఒ 27 ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా

మాట్లాడుతున్న గురుశేఖర్

ఉన్న దోభీ పోస్టులు భర్తీ చేసి రజక కుటుంబంలో ఉన్న యువతకు ఉపాధి కల్పించాలని, మోడ్రన్ దోభీ ఘాట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రజకులపై దాడులు, సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టడానికి రజకులకు ఎస్సీ, ఎస్టీ తరహాలో రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కౌసల్య విశ్వకర్మ ద్వారా రజకులకు జిల్లాలో దాదాపు 5 వేల మందికి వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చిందని తెలిపారు. ఈ శిక్షణలో రోజుకు రూ.500 చొప్పున వారం రోజులపాటు రూ.4 వేలు ఖాతాకు జమ చేస్తామని చెప్పారని, శిక్షణ పూర్తయి 5 నెలల అయినప్పటికీ కొంతమందికి మాత్రమే డబ్బులు పడ్డాయని చెప్పారు. చాలా మంది కి జమ కాలే దని వారు ఆవేదన వ్యక్తం చేశారు. శిక్షణకు హాజరయిన వారందరికీ రూ.4 వేలు జమ చేయాలని కోరారు. రూ.15 వేల కిట్టు అందించాలని, బ్యాంకుల ద్వారా కేంద్ర ప్రభుత్వం రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా మునియప్ప, ప్రధాన కార్యదర్శిగా మహేష్, 15 మందిని మండల కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులు చిదానంద, మండల, గ్రామ నాయకులు మంజు, మహేంద్ర, మౌనేష్, గంగన్న, రామేష్, ఎల్లప్ప, ఐదేసాబ్, 10 గ్రామాల నుంచి రజక వృత్తిదారులు పాల్గొన్నారు.

హాజరయిన నాయకులు

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

## ఎన్నాళ్లు అర్ధాకలి..?

- మున్సిపల్ కార్మికుల ఆందోళన తీవ్రతరం

**ప్రజాశక్తి - ఆదోని**

చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలు గడవక అర్ధాకలితో ఎన్నాళ్లు కాలం వెల్లదీసేదంటూ మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆందోళనను తీవ్రతరం చేశారు. ఆదోనిలో మున్సిపల్ వాటర్ పంపు హౌస్ నుంచి మున్సిపల్ కాంట్రాక్టు ఇంజనీరింగ్, వాటర్ సప్లయి విభాగాల్లో పని చేసే కార్మికులు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అంబేద్కర్ విగ్రహం, భీమాస్ కూడలి మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, సీనియారిటీ ఆధారంగా రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. తమ సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కార్యాలయంలోని మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. సమస్యలు విన్న కమిషనర్ సానుకూలంగా స్పందించి... ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పీరా సాహెబ్, సోమన్న, హమీద్ మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లోనూ మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు వర్కర్లు 15 రోజులుగా సమ్మెలో ఉన్నారని తెలిపారు. కొన్నిచోట్ల నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. మానవతా దృక్పథంతో ఇక్కడ విధులు నిర్వహిస్తూనే విరామ సమయంలో నిరసన వ్యక్తం చేస్తున్నామని చెప్పారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకపోతే అత్యవసర సేవలైన వాటర్ పంపింగ్, వీధి దీపాల సర్వీసులు నిలిపి వేసి పూర్తి స్థాయిలో విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ నెల 28న చర్చలకు ప్రభుత్వం నుంచి పిలుపు వచ్చిందని, అక్కడ తమ సమస్యలు ప్రస్తావించి పరిష్కారానికి స్పష్టమైన హామీ వస్తుందని ఆశాభావంతో ఉన్నామన్నారు. నిర్లక్ష్యం చేస్తే జూన్ 1 నుంచి పూర్తి స్థాయిలో సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు వీరేష్, చంటి, వలీ, శరత్, శంకర్, భరత్, మైమూద్, కైలాష్, కెపి.చంద్ర, రామాంజనేయులు, కృష్ణమూర్తి, కర్రెప్ప, రాఘవేంద్ర, వై.శ్రీనివాసులు, ఎలక్ట్రీషన్లు ఈరన్న, దాదు, షాషావలీ ఉన్నారు.

## స్లూయిజ్ ఏర్పాటుపై ప్రకటన హర్షనీయం

- రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూరి

**ప్రజాశక్తి- దేవనకొండ**

హంద్రీనీవా ప్రధాన కాలువకు గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ, మిగతా గ్రామాలకు సాగునీరు ఇస్తామని కర్నూలులో జరిగిన మినీ మహానాడులో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ తీర్మానం ప్రవేశపెట్టడం హర్షనీయమని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోటకొండ సూరి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరువుకు నిలయమైన ఈ ప్రాంతానికి పాలకుల నిర్లక్ష్యం వల్ల నిత్యం అన్యాయం జరుగుతోందని తెలిపారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించాలని రైతుసంఘం ఆధ్వర్యంలో పాదయాత్ర, ఆందోళనలు, 36 గంటల నిరవధిక దీక్షలు కూడా చేపట్టినట్లు చెప్పారు. హంద్రీనీవాకు గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేసి గుండ్లకొండ,

గుడిమర్రాళ్ల, బంటుపల్లి, చెల్లెల చెలిమెల, బేతపల్లి, బండపల్లి, కోటకొండ పొలాలకు సాగునీరు, చెరువులకు నీటిని నింపి రైతుల పొలాలను సస్యశ్యామలం చేయాలని కోరారు. టిడిపి మినీ మహానాడులో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, ఆలూర్ ఇన్‌ఛార్జ్ వీరభద్ర గౌడ్, ప్రజా ప్రతినిధులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే కాలువలు పూర్తి చేసి సాగునీరందించి చెరువులకు నీళ్లు నింపి ఇచ్చిన హామీని, చెప్పిన మాటలు నిలబెట్టుకోవాలని కోరారు.

## ఆస్పరిలో విషాదం

- విద్యుదాఘాతంతో యువతి మృతి - నెల రోజుల్లో పెళ్లి

**ప్రజాశక్తి - ఆస్పరి**

ఆస్పరిలో విషాదం చోటు చేసుకుంది. నెల రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువతి దూదేకుల సబీర (19) విద్యుదాఘాతంతో మృతి చెందారు. తమ కుమార్తె పెళ్లి ఎంతో ఘనంగా చేయాలన్న తల్లిదండ్రుల ఆశలు ఆవిరయ్యాయి. ఆస్పరిలో దూదేకుల కాశన్న, బేబీ దంపతులకు నలుగురు కుమార్తెలు. మూడో కుమార్తె సబీర. గురువారం ఉదయం కుళాయికి నీరు రావడంతో బోర్డులో వైరు పెట్టి స్వీచు వేసి మోటార్‌కు ఉన్న వైరు అర్థ్ ఇవ్వడానికి వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. కాశన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## జాబ్ మేళాకు విశేష స్పందన

**ప్రజాశక్తి - ఆలూరు**

ఎపి నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం గురువారం ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీ ప్రతినిధులు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు చేపట్టారు. దాదాపు 201 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా 75 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.రమాదేవి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వీరేష్, ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్లోరైడ్ నీటితో అనారోగ్య సమస్యలు

- జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు

**ప్రజాశక్తి- దేవనకొండ**

ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల పలు అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు, స్థానిక వైద్యాధికారి విజయ్ భాస్కర్ తెలిపారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గురువారం దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కరిగికొండ గ్రామంలో నిర్వహించిన సంచార వైద్య చికిత్స కార్యక్రమాన్ని వారు తనిఖీ చేశారు. ఫ్లోరోసిస్ వల్ల కలిగే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఫ్లోరోసిస్ వల్ల దంతాలు పసుపు, గోధుమ రంగులోకి మారడం, కిడ్నీ సంబంధిత వ్యాధులు, ఎముకలు వంగిపోయి కీళ్ల నొప్పి, కండరాల బలహీనత, ప్రేగు గోడలు దెబ్బతిని పోషకాలు, ఖనిజ లవణాలు శోషణ జరగక రక్తహీనతకు గురయ్యే అవకాశం ఉందన్నారు. దప్పిక తీరకపోవడం, పిల్లల పెరుగుదలపై ప్రభావం చూపుతుందని తెలిపారు. బీడి, చుట్ట, పాన్, పాన్ మసాలా వంటివి ఉపయోగించడం వల్ల ఫ్లోరోసిస్ సంబంధిత ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. మల్టీ విటమిన్, ఐరన్, జింక్, క్యాల్షియం, విటమిన్–సి ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం బాధితులకు ఉచితంగా మల్టీ విటమిన్, విటమిన్–సి మాత్రలను అందించారు. ఆరోగ్య విద్యాబోధకులు జయలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త హేమలత, ఆశా కార్యకర్త, ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

## ఇద్దరు చిన్నారులకు సర్జరీ

**ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్**

గాయాలపాలైన ఇద్దరు చిన్నారులకు వైద్యులు సర్జరీ కాపాడారు. వివరాలిలా ఉన్నాయి... కొత్తగా కడుతున్న 3వ అంతస్తు ఇంటి పక్కన ఆడుకుంటున్న చిన్నారులు లిఖిత, రుచితపై ఇటుకలు పడ్డాయి. వారి తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న ఆస్పతికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మెడికవర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అత్యవసర వార్డులో చేర్చుకుని సిటి స్కాన్ చేశారు. లిఖిత పుర్రె ఎముక విరిగి మెదడుకు గుచ్చుకొని తీవ్ర రక్తస్రావం అవుతున్నట్లు వైద్యులు గుర్తించారు. డాక్టర్ విశ్వ కుమార్ న్యూరో సర్జన్ చిన్నారిని ఆపరేషన్ థియేటర్‌కు షిఫ్ట్ చేసి మెదడులో ఉన్న రక్తస్రావం తొలగించారు. తలకు టైటానియం స్క్రూ, ప్లేట్స్‌ను అమర్చారు. రుచితకు మెదడు వాపు రావడంతో మెడికల్ మేనేజ్‌మెంట్ ద్వారా డాక్టర్ విశ్వ కుమార్ చికిత్స ఇచ్చారు. సర్జరీ అనంతరం పీడియాట్రిక్ ఐసియు డాక్టర్ ఆర్.మురార్జీ, డాక్టర్ కె.సింధూర రెడ్డి, డాక్టర్ మమత, చిన్నారికి కావాల్సిన పిఐసియు ట్రీట్‌మెంట్ ఇచ్చారు. చిన్నారి ఆరోగ్యం మెరుగ్గా ఉండడంతో బుధవారం డిశ్చార్జ్ చేశారు. మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు క్లస్టర్ హెడ్ డాక్టర్ వై.మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## సారా, కల్తీ మద్యానికి దూరంగా ఉండాలి

- ఎక్సైజ్ సిఐ సైదుల్

**ప్రజాశక్తి - ఆదోని**

నాటు సారా, కల్తీ మద్యం సేవించే వారిలో లివర్ సంబంధిత అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వాటికి దూరంగా ఉండాలని ఆదోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ తెలిపారు. గురువారం ఆదోని శివారు కొండ ప్రాంతాల్లో నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు చేసి బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నవోదయం 2.0లో భాగంగా ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కొండల్లో 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 35 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆదోనిలోని వాల్మీకి నగర్‌కు చెందిన బోయ మురళీపై కేసు నమోదు చేసి అతన్ని రిమాండ్‌కు తరలించామన్నారు. నాటు సారా, కల్తీ మద్యం సేవించడం వల్ల తలెత్తే అనారోగ్య సమస్యలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కర్ణాటక మద్యం తరలించడం, నాటుసారా కాచి విక్రయించడం చట్టరీత్యా నేరమని చెప్పారు. నాటుసారాను సమూలంగా నిర్మూలించేందుకు ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు.

బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - మంత్రాలయం**

అనారోగ్యంతో మృతి చెందిన వడ్డే వెంకటేష్ కుటుంబానికి వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక రామచంద్ర నగర్‌కు చెందిన యువకుడు వెంకటేష్ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రదీప్ రెడ్డి.. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వడ్డే నారాయణ, రామాంజనేయులుతో కలిసి వెంకటేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి, ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నివాళులర్పిస్తున్న ప్రదీప్‌రెడ్డి

## విజ్ఞాన నిలయాలు.. గ్రంథాలయాలు...

- లైబ్రేరియన్ పెద్దక్క

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు అని లైబ్రేరియన్ వి.పెద్దక్క తెలిపారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ఘనంగా జరిగాయి. ముందుగా ఉదయం 8 గంటలకు విద్యార్థుల చేత పుస్తక పఠనం చేయించారు. 8.30 గంటలకు మాలిక్ బాష చరిత్ర, జనరల్ నాలెడ్జి, డ్రాయింగ్‌కు సంబంధించిన విషయాలను విద్యార్థులకు వివరించారు. 9.30 గంటలకు జి.వెంకటేశ్వర్లు యోగా, హాసిని మెడిటేషన్ తరగతులను చెప్పారు. అనంతరం ముంతాజ్ బేగం విద్యార్థులకు పేపర్ కటింగ్ నేర్పించారు.

## 'సూర్య ఘర్'ను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపిడిఒ గీతావాణి

**ప్రజాశక్తి - ఆస్పరి**

కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ గీతా వాణి, తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి, విద్యుత్ ఎఇ ఆంజనేయ శాస్త్రి కోరారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల, గ్రామస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం గురించి వివరించి, అంతర్జాతీయ యోగా డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యుత్ గురించి ఆందోళన వద్దని, ఇంటి పైకప్పుపైనే సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకొని ఇంటికి సరిపడ విద్యుత్‌ను వాడుకోవచ్చని ప్రజలకు సూచించారు. మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించి, ఆదాయం కూడా పొందవచ్చని తెలిపారు. సాంప్రదాయ విద్యుత్ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడం, పర్యావరణ హితమైన విద్యుత్‌ను ప్రోత్సహించడం కోసం కేంద్ర ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ప్రస్తుతం వినియోగదారానికి వస్తున్న బిల్లు 1000, సోలార్ ఏర్పాటు చేసిన తర్వాత వచ్చే బిల్లు రూ.338 అని తెలిపారు. గ్రూప్ హౌసింగ్ సొసైటీ లేదా ఆర్‌డబ్ల్యుఎలకు ఈ పథకం కింద ప్రతి కిలో వాట్‌కూ రూ.18 వేల సబ్సిడీ ఇస్తారని చెప్పారు. ఈవీ ఎలక్ట్రానిక్ వాహనాల, చార్జింగ్ లాంటి కామన్ సేవలకు ఈ సబ్సిడీ ఇస్తారని తెలిపారు. ఒక్కో ఇంటికి 3 కిలో వాట్ చొప్పున 500 కిలో వాట్ సామర్థ్యం వరకు ఈ సబ్సిడీ ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు. డాక్టర్ బాలకృష్ణా రెడ్డి, ఎపిఎం జనార్ధన్, ఇఒఆర్‌డి విజయ భాను, పిఆర్ ఎఇ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కంటి ఆస్పత్రి రోడ్డు శిథిలం

- పట్టణ పౌర సంక్షేమ సంఘం

**ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్**

ఎంతో చరిత్ర కలిగిన కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో రోడ్లపై వర్షం నీరు నిలిచి, రోడ్లు శిథిలమై వృద్ధులు, రోగులు ప్రమాదాలకు గురవుతున్నారు. జిల్లా వైద్యాధికారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయాల సమీపంలో ఉన్నప్పటికీ ఏళ్లు గడుస్తున్నా రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడం బాధాకరమని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యాకోబ్, రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మొహద్దీన్ తెలిపారు. గురువారం ప్రభుత్వ కంటి ఆస్పత్రి ప్రాంతంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం పర్యటించింది. రోడ్లపై నిలిచిన నీళ్లు, శిథిలమైన రోడ్డును చూసి చలించిపోయి కార్యకర్తలు వెంటనే ఎపిఎంఎస్ ఐడిసి ఆఫీస్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ నిరసనకు సిత్తారి వెంకట వర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎక్కడా శుభ్రత కనిపించడం లేదని తెలిపారు. కంటి ఆస్పత్రి రోడ్డు శిథిలమై ఏళ్లు గడుస్తున్నా అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. శిథిలమైన రోడ్డుతో పాటు ఆ ప్రాంతమంతా వ్యర్థాల తో మారుమూల గ్రామాలను తలపించే విధంగా ఉందన్నారు. కంటి ఆస్పత్రికి వచ్చిన వృద్ధులు, ఇతర రోగులు అనేకమంది కింద పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంటి ఆస్పత్రికి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, వర్షం నీరు నిలవకుండా మురుగు కాలువలు నిర్మించాలని కోరారు. సమీపంలో ఉన్న ఎపి ఎంఎస్ సిఐడిసి ఇఇ కరీముల్లాకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ... మూడేళ్ల నుంచి నిధులు రాలేదని, ఈ మధ్యే కొన్ని నిధులు వచ్చాయని, వెంటనే రోడ్డును మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చారు. ఎండి.యూనుస్, ఎన్.శ్రీనివాసరెడ్డి, ఎస్.అన్వర్ బాష, ఎన్.మద్దిలేటి, కె.శ్రీనివాసులు, బి.శశి కుమార్ రెడ్డి, ఎస్.షాహిద్ పాల్గొన్నారు.

నిలిచిన వర్షపు నీటిని చూపుతున్న నాయకులు

## ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

- ఎంపీ నాగరాజు

-కురువ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

**ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్**

ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక జడ్‌పిలోని ఎంపిపి హాలులో 135 మంది కురువ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కురువ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంకె.రంగస్వామి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ నాగరాజు, సంఘం జిల్లా అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, సెట్కూర్ సిఇఒ వేణుగోపాల్, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, అమీలియో లక్ష్మి ప్రసాద్ పాల్గొని విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, జ్ఞాపిక, సర్టిఫికెట్, నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. ఇంతమంది విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం సంతోషంగా ఉందని, విద్యార్థులు చదువులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కురువలు ఐక్యంగా ఉండి పిల్లలను చదివించాలని, ఐకమత్యంతో ఉంటే అన్ని సాధించుకుంటారని, ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. భానుశంకర్, రాజశేఖర్, గడ్డం రామకృష్ణ, సిస్ట్రా సత్యనారాయణమ్మ, కర్నూలు జిల్లా కురువ సంఘం ఉపాధ్యక్షులు పెద్దపాడు ధనుంజయ, తిమ్మాపురం ఉరుకుంద, కత్తి శంకర్, వెంకటేశ్వర్లు, కోశాధికారి కెసి.నాగన్న, మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీలీలమ్మ, అనితమ్మ, గౌరవ సలహాదారులు కె.కిష్టన్న, పాల సుంకన్న, మధు చికెన్ మల్లికార్జున, బీసీ.తిరుపాల్, వెంకటేశ్వర్లు, రేమట సర్పంచి వెంకన్న, అంపయ్య, పెద్దపాడు పుల్లన్న, నాగేంద్ర, ఎల్లయ్య, హనుమంతు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ నాగరాజు

## నేడు 'అభివృద్ధి'కి శంకుస్థాపన

**ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు నియోజకవర్గ పరిధిలోని 19 వార్డుల్లో 31 రకాల అభివృద్ధి పనులకు శుక్రవారం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ శంకుస్థాపనలు చేయనున్నారని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం, ఎన్‌క్యాప్, సాధారణ నిధులకు సంబంధించి 1, 3, 6, 8, 10, 13, 14, 15, 16, 18, 23, 24, 42, 43, 44, 45, 46, 48, 49వ వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని పేర్కొన్నారు.

## లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే విత్తనాలు

కొనాలి : ఎఒ రవి

**ప్రజాశక్తి - మద్దికెర**

లైసెన్స్‌డ్ డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని ఎఒ రవికుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లా డారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత ప్యాకెట్‌పై ఉన్న లాట్ నెంబర్, డీలర్ ఇచ్చిన రసీదుపై లాట్ నెంబర్‌ను సరిచూసుకోవాలన్నారు. కొను గోలు చేసిన తర్వాత రసీదులో లాట్ నెంబర్ గడువు తేదీ, డీలర్ సంతకాలు తీసుకోవాలని చెప్పారు. రైతులు విత్తన రకాన్ని ఎంచుకునే టప్పుడు గతంలో వచ్చిన దిగుబడి, చీడ పీడలను తట్టుకునే సామర్థ్యాలను తెలుసుకోవాలని సూచించారు. లూజు విత్తనాలు కొనుగోలు చేయకూడదని తెలిపారు.

# పారిశుధ్య కార్మికుల జీవితాలు దుర్భరం

• చాలీచాలని వేతనాలతో జీవనం • వెట్టి చాకిరి చేస్తున్న పంచాయతీ • బతుకులకు భద్రత కరువు

**ప్రజాశక్తి - పత్తికొండ**

చాలీచాలని జీతాలతో జీవనం గడుపుతున్న పారిశుధ్య కార్మికుల కష్టాలు డివిజన్ కేంద్రమైన పత్తికొండలో నెలకొన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛభారత్, స్వచ్ఛఆంధ్ర , స్వచ్ఛ దివస్ అనే పేరుతో పట్టణాలు, గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని లక్ష్యంతో కార్యక్రమాలను నిర్వహిస్తుంది. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నామని పత్తికొండ పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2011 జనాభా ప్రకారం పత్తికొండలో సుమారు 30 వేల మంది జీవనం సాగిస్తున్నారు. మేజర్ గ్రామపంచాయతీ లోని క్లాప్‌మిత్రలు 26 మంది, గ్రామ పంచాయతీ కార్మికులు 51 మందితో పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. మేజర్ పంచాయతీలోని వార్డులు 20, మజారా రామచంద్రాపురం పంచాయతీతో పాటు గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయంలో పారిశుధ్య పనులు చేస్తున్నామని కార్మికులు పేర్కొంటున్నారు. చాలీచాలని జీతాలతో జీవనం ,కాలానికి అనుగుణంగా ధరల పెంపుతో పూట గడవడానికి, తినడానికి చాలా ఇబ్బందిగా ఉందంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్బులు, బట్టలు, నూనె, చేతులకు గ్లౌజులు, కాళ్లకు చెప్పులు మొక్కుబడిగా పంపిణీ చేస్తున్నారంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్యంతో మరణిస్తే కుటుంబానికి భద్రత కూడా లేదంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపుగా 15 సంవత్సరాల పాటు పారిశుధ్య పనులు చేస్తున్న రూ.12,000 జీతం ఇస్తున్నారంటూ కొందరు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందిస్తూ జీతాలు పెంచాలంటూ కార్మికులు కోరుతున్నారు.

పారిశుధ్యం పనులు చేపడుతున్న కార్మికులు

### ఏజెన్సీల ద్వారా జీతాలు పంపిణీ

- పత్తికొండ మేజర్ పంచాయతీ ఇఒ నరసింహులు

పత్తికొండ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కార్మికులకు గడ్డం రంగస్వామి ఏజెన్సీ ద్వారా జీతాలను నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేస్తున్నాం. కార్మికులు మరణిస్తే ఇజిపిఎఫ్ యాప్‌లో వివరాలను అప్లోడ్ చేస్తాం. దాదాపు రూ.ఐదు లక్షల మేరకు ఇన్సూరెన్స్ వర్తిస్తుంది.

### కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

- సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి

మేజర్ పంచాయతీలోని కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల చేత వెట్టి చాకిరి చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో కార్మికులను కలుపుకొని ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

### పూట గడవడానికి ఇబ్బంది

- పారిశుధ్య కార్మికుడు , బాటా రమేష్



రూ.10 ఎలా బతికేది. చాలీచాలని జీతంతో కుటుంబ పోషణ గడవడానికి ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి జీతం మన పెంచాలి.

**IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) ADONI**

I.P. No. 07/2025

Kapa Damodhara Reddy .... Petitioner

Vs

A.Sreenivasa Reddy & 28 others .... Respondents

**GENERAL NOTICE**

Whereas the above named petitioner filed petition under Section 10 of Provincial Insolvency Act to declare the petitioner as insolvent. Hence anybody has got any wants any objection with regard to the above petition are hereby appear before this court on **25-08-2025 at 10-30 AM** and answer the said petition and also anybody wants any objection to appear before this court, otherwise the petition will be decided exparte.

(By court order)

**B. ADISHESHAPPA**, B.A, L.L.B.,
**K. MALLIKARJUNA**, B.Com, L.L.B., Advocates,
D.No.18/468, Court Road,
Opp: Quibula Quarters,
Yemmiganur -518 360,
Kurnool Dist.
Cell No.9912626644.